క్లుప్తంగా

చూసి వెళ్లండి!



పెద్దకొడప్‌గల్: మండలంలో పోచారం తండా, పోచారం మధ్యలో ఉన్న బ్రిడ్జి గత ఏడాది కురిసిన వర్షాలకు కూలి పోయింది. గుంతలు పడటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో సీసీ కెమెరాలతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపల్ కవితా తోరన్‌కు పలుమార్లు కోరినా పట్టించుకోలేదని విద్యార్థులు బుధవారం ప్రిన్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

రోడ్డును బాగు చేయరూ?



తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్ గ్రామంకు వెళ్లే తార్‌రోడ్డును బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి గ్రామంకు వెళ్లే రెండు కిలో మీటర్ల రోడ్డులో తార్‌పోయి కంకర తేలి అధ్వానంగా తయారైందన్నారు అలాగే గుంతలమయంగా మారడంతో రోడ్డు ఆనవాలు లేకుండా పోయిందన్నారు. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్డు బాగు చేయడానికిగత ఆరునెలలక్రితం రూ.80 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభించలేదు.

యూత్ డిక్లరేషన్ క్విజ్ కోసం రిజిస్ట్రేషన్లు



బాన్సువాడ/నస్రుల్లాబాద్ (బీర్కూర్): రాజీవ్ గాంధీ యూత్ డిక్లరేషన్ క్విజ్ కార్యక్రమంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి కాసుల బాలరాజు కోరారు. బుధవారం ఆయన బీర్కూర్‌లో మాట్లాడుతూ 16 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న వారు ఈనెల 17వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 18న ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని శంకర్, రాములు, రఫీక్, సాయిలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం



లింగారెడ్డి

సదాశివనగర్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోతి లింగారెడ్డిని నియమించినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. లింగారెడ్డి పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నందున ఆయన్ను రెండో సారి యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

రూ.10 లక్షల సాయం అందించాలి



కామారెడ్డి టౌన్: బీసీ కుల వృత్తుల వారికి రూ.10 లక్షల సాయం అందించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. లక్ష మాత్రమే సాయం చేసి చేతులు దులుపుకోవడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, బాబురాజ్, రవి, వినీత్, వేణు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..!

- విత్తనాల కోసం రైతన్న వెతుకులాట
- కల్తీ లేని విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్



మద్నూర్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

మద్నూర్: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. పొలాలను ట్రాక్టర్లతో దుక్కి దున్ని పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది తదితర పంటల కోసం చదును చేస్తున్నారు. పంట దిగుబడి కోసం కొందరు రైతులు చెరువు మట్టి, పశువుల ఎరువు పొలాల్లో వేసి దుక్కిలు దున్నుతున్నారు. మండలంలో గత ఏడాది సాగు చేసిన పెసర, మినుము కోతల సమయంలో భారీ వర్షాలు రావడంతో పంట బాగా దెబ్బతినింది. రబీలోని అన్ని రకాల పంట దిగుబడులు పూర్తిగా పడిపోవడంతో గత ఏడాది రైతులు నష్టాలే చవిచూశారు. ఈ సారైనా సకాలంలో సాగు చేస్తే దిగుబడులు వస్తాయని రైతులు ఆశించినా అవసరమైన విత్తనాలు అందుబాటులో లేని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడగానే విత్తనాలు వేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వం సోయా విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేయడంతో కొందరు రైతులు బయటి మార్కెట్‌లో, మరికొందరు మహారాష్ట్రలో విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. మండలంలో వ్యవసాయ సాగుకు అనువైన భూమి 50,325 ఎకరాలు ఉంది. ఇందులో 29,159 ఎకరాల్లో సోయా, 20,600 ఎకరాల్లో పత్తి, 5,129 ఎకరాల్లో వరి, 2,560 ఎకరాల్లో పెసర, 2,122 ఎకరాల్లో మినుము, 2165 ఎకరాల్లో కంది, 520 ఎకరాల్లో మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేశారు.

నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి



రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత ఏడాది దిగుబడులు సరిగా లేక నష్టం రావడంతో అప్పులే మిగిలాయి.

–వడ్డివార్ అంజయ్య, రైతు, మద్నూర్

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద కొనాలి



లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి. వాటికి తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలి. 110 మిల్లీ మీటర్ల వర్షం పడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి.

–రాజు, ఏవో, మద్నూర్

సాగునీటితో సస్యశ్యామలం



లింగంపేటలో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



పిట్లంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

- రైతుల కష్టాలు తీర్చిన ఏకైక సీఎం కేసీఆర్
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే

లింగంపేట: సాగునీటితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం లింగంపేటలోనిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతును రాజుగా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగడానికి దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రైతుబంధు, బీమా పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 530 చెరువులను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. లింగంపేట మండలంలో రూ. 55 కోట్లతో 22 చెక్ డ్యాంలు నిర్మించినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర పాలిత రాష్ట్రాల్లో సాగునీటి పథకాలు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. అనంతరం నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌నాయక్, ఈఈ మల్లేశం, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీటీసీ శమీమున్నిసాబేగం, ఏఈ అరుణప్రభ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, అట్టెం శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్ధారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజయ్య, సింగిల్ విండో చైర్మన్ దేవెందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియోద్దిన్, సంతోష్‌రెడ్డి, నహీం, నరహరి పాల్గొన్నారు.

పిట్లం: దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరిని ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. పిట్లంలో బుధవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గ నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో నిర్మిస్తున్న నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్‌తో పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ మండలలోని రైతుల భూములు సస్యశ్యామలం అవుతాయి అని, తద్వారా 40 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ పథకంలో జుక్కల్ నియోజకవర్గంలోని 515 చెరువులలో పూడికతీత పనులు చేశామన్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తన కోసం కుర్చీ ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల సర్వే



మోతెలో సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తాడ్వాయిలో..



భిక్కనూరులో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే లింగంపేట మండలంలో ఎంఈవో రామస్వామి 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్ ఇంటింట వెళ్లి సర్వే నిర్వహించారు. భిక్కనూరును ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యాదగిరి ఆధ్వర్యంలో, ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మండలంలోని గండిమాసానిపేట, లక్ష్మాపూర్ గ్రామాలలో ఉపాధ్యాయులు చిరంజీవులు, రమేష్, ప్రకాష్, వెంకటరమణ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపాలని కోరారు. తాడ్వాయిలో ఉపాధ్యాయులు ఇంటింట తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవాలి



సదాశివనగర్: మండలంలోని మర్కల్ గ్రామంలో బుధవారం కామారెడ్డికి చెందిన సేవా సంఘం టీఐ–2 ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం నిర్వహణ అధికారిణి సునంద మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యంపై అనుమానం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రవాటి రాజిరెడ్డి, ఏఎన్‌ఎం సావిత్రి, సిబ్బంది హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

పాడితో అధిక లాభాలు



తాడ్వాయి: రైతులు వ్యవసాయంతో పాటు పాడితో అధిక లాభాలు సాధించవచ్చని విజయ డైరీ డీడీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని ఎర్రాపహాడ్ పాల శీతలీకరణ కేంద్రంలో అధికంగా పాలు పోసిన రైతులకు ప్రోత్సామక బహుమతులు ఇచ్చి సన్మానం చేశారు. ఎర్రాపహాడ్ పరిధిలోని వివిధ కేంద్రాలలో అధికంగా పాలు పోసిన 40మంది రైతులకు స్టీల్ క్యాన్లు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ చైర్మన్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు కిష్టారెడ్డి, బీఎంసీ ఇన్‌చార్జి రవిందర్‌రెడిడ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకా..



కామారెడ్డి రూరల్: మండలంలోని లింగాయిపల్లి గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 5,870 గొర్రెలు, 1,168 మేకలకు పీపీఆర్ టీకా వేసినట్లు డాక్టర్ రవికిరణ్ తెలిపారు.

ఉపాధి పనులకు కూలీలను పెంచాలి



రాజంపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. ఎల్లాపూర్ తండా, బుజ్జికుంటలో పనులను పరిశీలించారు.

మానవత్వం చాటుకున్న ఆస్పత్రి సిబ్బంది



సునీతకు సేవలు అందించిన ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

పిట్లం: పిట్లంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగించే సునీత అనారోగ్యానికి గురికావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది అక్కున చేర్చుకొని వైద్య సేవలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఆసుపత్రి వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ సునీత చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రావడంతో ఆమె బాగోగులు చూసుకునేందుకు బంధువులకు సమాచారం ఇచ్చినా ఎవరూ రాలేదన్నారు. దీంతో స్థానిక వైద్య సిబ్బంది ఆమెకు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఆరోగ్యం కుదట పడటంతో బుధవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంకు తరలించినట్లు వెల్లడించారు.

ఊర చెరువు పండుగకు ఏర్పాట్లు పూర్తి



బాన్సువాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్



వడ్లం చెరువు వద్ద పరిశీలిస్తున్న ఎంపీడీవో రాణి

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊర చెరువు పండుగ నిర్వహించనున్నట్లు బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తెలిపారు. వైస్ చైర్మన్ జుబేర్, మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్లతో కలిసి ఆయన కల్కిచెరువు కట్ట ఏర్పాట్లు పరిశీలించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కాస్లాబాద్, వడ్లం గ్రామాల్లో ఏర్పాట్లకు సంబంధించి ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్ పలు సూచనలు చేశారు. బీర్కూర్ మండలంలో నిర్వహించనున్న పండుగకు సంబంధిన ఏర్పాట్లను తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రసాద్ పరిశీలించారు. బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కుమ్మరి రాజమణి రాజు కోరారు. నాగిరెడ్డిపేట లోని పలు గ్రామాల్లోని చెరువుల వద్ద నిర్వహించనున్న పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ సూచించారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కామారెడ్డి టౌన్ : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గడపగడపకు ప్రచారం చేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత కృష్ణ సూచించారు. బుధవారం కామారెడ్డిలో జరిగిన బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం చేయాలన్నారు. యువతకు ఓటరు నమోదుపై అవగాహన పెంచాలన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బంగ్లా చైతన్యగౌడ్, జిల్లా ఇంచార్జి సుధీర్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలపై అవగాహన కల్పించాలి

రుద్రూర్: గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. కోటగిరి మండలం హంగర్గఫారంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని బుధవారం సందర్శించారు. వైద్య సిబ్బంది చేస్తున్న కంటి పరీక్షలు పరిశీలించారు. అర్హులందరూ కంటి పరీక్షలు చేయించుకునేటట్లు ప్రచారం చేయాలని సూచించారు.

ఆధ్యాత్మికం

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



కామారెడ్డి టౌన్: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇస్కాన్ సంస్థాపక చార్యులు, ఇస్కాన్ గురువు త్రిదండి సన్యాసి రాఘవ స్వామి మహారాజ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక శ్రీ కృష్ణమందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామాల్లో హిందూ ధర్మంపై కార్యక్రమాలు, ప్రచారాలు చేయాలన్నారు.

నేడు అంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ



మద్నూర్: డోంగ్లీ మండలంలోని కుర్లాలో గురువారం అంజనేయస్వామి ఆలయంలో విగ్రహం పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలోని హనుమాన్ మందిర్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తి ఉత్సవం

రాజంపేట: ఇస్కాన్ ఆధ్వర్యంలో రాఘవ స్వామి మహారాజ్ ఆధ్వర్యంలో రాజంపేటలో భక్తి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ హనుమాన్ ఆలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. పురోహితులు అంజనేయశర్మ, దినేష్ శర్మలు ఆలయ సంప్రోక్షణ, పాత ధ్వజ స్తంభ తొలగింపు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నలుగురు దంపతులతో యజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, కాలనీ కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, రాజేందర్ గౌడ్, దుగ్యాల శ్రీనివాస్, లింబాద్రిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

14 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

బిచ్కుంద: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దళితులను కించ పరిచేవిధంగా మాట్లాడిన వ్యక్తి కేసుమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య బుధవారం ఎస్సై శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి మండలం మోతే గ్రామానికి చెందిన భుమారెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కొనసాగుతున్న సర్వే

నిజాంసాగర్: మండలంలోని తున్కిపల్లిలో అటవీ, రెవెన్యూ భూముల సర్వే నిర్వహించారు. సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోస్త్‌లో దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్ (దోస్త్)లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఇందూరు గంగాధర్ కోరారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

దీక్షకు ముదిరాజ్ సంఘం మద్దతు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యం నుంచి రక్షించాలని కోరుతూ కాచాపూర్‌లో 44 రోజులుగా చేపట్టిన నిరసన దీక్షకు ముదిరాజ్ సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు.

బోరు మోటార్ కోసం ఆర్థిక సహాయం

దోమకొండ: మండల కేంద్రమైన దోమకొండలో బుధవారం బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆర్థిక సహాయంతో మూడు బోరు మోటారు ఏర్పాటు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్ తెలిపారు.

రూ. లక్ష సాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: కుల వృత్తుల వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మి సూచించారు. 18 నుంచి 55 ఏళ్ల వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

బాన్సువాడ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం బాన్సువాడ పట్టణానికి రానున్నట్లు ఆపార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి. బాలరాజు తెలిపారు. బుధవారం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ రాష్ట్రంలో సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, సురేష్, కరుణాకర్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో భూంపల్లి

కామారెడ్డి టౌన్/సదాశివనగర్: కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో గురువారం చలో భూంపల్లి ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయ్యే వరకు ఉద్యమం చేస్తాం అన్నారు. చలో భూంపల్లి రిజర్వాయర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి కోరారు. అక్కడికి ఉదయమే తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.